క్లుప్తంగా

రేపు విద్యుత్ సరఫరా నిలిపివేత

జామి: మండలంలోని కుమరాం విద్యుత్‌సబ్ స్టేషన్ పరిధి గ్రామాలకు శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్‌శాఖ ఏఈ సీహెచ్.దేముడు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. 33 కేవీ విద్యుత్ లైన్ల మెయింటెనెన్స్, విద్యుత్ తీగలపై అడ్డంగా ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు పనులు చేపట్టనున్న నేపథ్యంలో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నామని పేర్కొన్నారు. కుమరాం, ఏ.ఆర్.పేట, బలరాంపురం, ఎం.కె.వలస, కోరుకొండ సైనిక్ స్కూల్, ఏఎస్ జూట్ మిల్లు తదితర గ్రామాలకు సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

నేడు సర్వసభ్య సమావేశం

గుర్ల: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం గురువారం ఉదయం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ కల్యాణి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ పొట్నూరు ప్రమీల అధ్యక్షతన స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించనున్న ఈ సమావేశానికి మండల అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు హాజరు కావాలని కోరారు.

శివరాత్రికి ప్రత్యేక సర్వీసులు

శృంగవరపుకోట: మహాశివరాత్రి జాతర సందర్భంగా ఈనెల 18, 19 తేదీల్లో రెండు రోజుల పాటు స్థానిక ఆర్టీసీ బస్‌స్టాండ్ నుంచి పుణ్యగిరి, సన్యాసయ్యపాలెంకు ప్రత్యేక బస్‌లు నడుపుతున్నట్టు ఆర్టీసీ డిపో మేనేజర్ కె.రమేష్ బుధవారం తెలిపారు. 18న 20 సర్వీసులు, 19న 15 సర్వీసులు డిపో నుంచి పుణ్యగిరి, సన్యాసయ్యపాలెంకు నడుస్తాయని పేర్కొన్నా రు. పుణ్యగిరి వెళ్లే భక్తులు ఆర్టీసీ డిపోలో లేదా, పుణ్యగిరి రోడ్డులో తహసీల్దార్ కార్యాలయం వద్ద బస్సులు ఎక్కవచ్చన్నారు. సన్యాసయ్యపాలెం వెళ్లే భక్తులు ఆర్టీసీ కాంప్లెక్స్‌లో లేదా ధర్మవరం రోడ్డులో పాతబస్టాండ్ వద్ద బస్‌లు ఎక్కవచ్చని వివరించారు. పుణ్యగిరికి రూ.10, సన్యాసయ్యపాలెంకు రూ.20 చార్జీ వసూళ్లు చేస్తామని, ప్రతి 5 నిముషాలకు ఒక ఆర్టీసీ బస్ ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.

గృహసారథుల సమావేశం రేపు

చీపురుపల్లిరూరల్(గరివిడి): గరివిడి మండలంలోని వైఎస్సార్‌సీపీ గృహసారథులు, సచివాలయ కన్వీనర్ల సమావేశం ఈనెల 17న చీపురుపల్లి రాధామాదవ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించనున్నట్లు ఆ పార్టీ మండల నాయకుడు, ఏఎంసీ మాజీ చైర్మన్ మీసాల విశ్వేశ్వరరావు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆరోజు ఉదయం 10 గంటలకు నిర్వహించనున్న కార్యక్రమానికి రాష్ట్ర విద్యాశాఖమంత్రి బొత్స సత్యనారాయణ, పార్టీ రీజనల్ కో–ఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి, జిల్లా పార్టీ అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ అతిథులుగా హాజరవుతారని పేర్కొన్నారు. సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, పీఏసీఎస్‌ల అధ్యక్షులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు హాజరు కావాలని కోరారు.

పెట్రోల్ బంక్‌లో తనిఖీలు



పెట్రోల్ శాంపిల్స్ సేకరిస్తున్న సీఎస్‌డీటీ మూర్తి

శృంగవరపుకోట: స్థానిక లక్ష్మీశ్రీనివాస ఎంటర్ ప్రైజస్ పేరుతో నిర్వహిస్తున్న పెట్రోల్‌బంక్‌లో సీఎస్‌డీటీ ఎస్.వి.వి.ఎస్.మూర్తి బుధవారం తనిఖీలు చేశారు. పెట్రోల్, డీజిల్ క్వాలిటీ, తూనిక యంత్రపరికరాలను పరిశీలించారు. వివరాలను ప్రత్యేక యాప్‌లో నమోదు చేశారు.


పోలింగ్ కేంద్రాల పరిశీలన



పోలింగ్ బూత్‌లను పరిశీలిస్తున్న అధికారులు

కొత్తవలస: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి స్థానిక ఉన్నత పాఠశాలలోని 144,145 పోలింగ్ బూత్‌లను తహసీల్దార్ డి.ప్రసాదరావు ఆధ్వర్యంలో సీఐ ఎస్.బాలసూర్యారావు, ఎంపీడీఓ వై.పద్మజ బుధవారం పరిశీలించారు. తహసీల్దార్ మాట్లాడుతూ మండలంలో 2,326 మంది పట్టభద్రులు ఓటు నమోదు చేసుకున్నారని చెప్పారు. బూత్ నంబర్–144లో 1,239 మంది, బూత్ నంబర్14 5లో 1,087 మంది ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు.

సీనియర్ సిటిజన్ల కార్యవర్గం ఎన్నిక



మండల సీనియర్ సిటిజన్ల వెల్ఫేర్ అసోసియేషన్ కార్యవర్గం

జామి: మండల సీనియర్ సిటిజన్ల వెల్ఫేర్ అసోసియేషన్ కార్యవర్గం ఎన్నికను జిల్లా సీనియర్ సిటిజన్ల వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు కట్టమూరి చంద్రశేఖర్ శర్మ ఆధ్వర్యంలో జామిలో బుధవారం నిర్వహించారు. సంఘం అధ్యక్షుడిగా కె.సూర్యప్రకాశరావు, ప్రధాన కార్యదర్శిగా వి.సీతారామయ్య, ఉపాధ్యక్షుడిగా చుక్క సూరిదేముడు, కోశాధికారిగా ఎరకయ్యశెట్టి, సహాయ కార్యదర్శిగా జె.ప్రసాద్‌ను ఎన్నుకున్నారు. అనంతరం సంఘం విధివిధానాలు, ప్రయోజనాలను వివరించా రు. ఆ సంఘం జిల్లా కార్యదర్శి బి.గజన్నాథరావు, జిల్లా ఉపాధ్యక్షుడు ఎం.వెంకటరావు పాల్గొన్నారు.

86 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు

- ప్రతి ధాన్యం గింజనూ కొనుగోలు చేస్తాం
- రైతులు అధైర్య పడాల్సిన పని లేదు
- టీడీపీ, ఎల్లో మీడియా దుష్ప్రచారాలు మానుకోవాలి– ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అప్పలనరసయ్య

గజపతినగరం: గజపతినగరం నియోజకవర్గంలో రైతుల నుంచి ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ఇప్పటి వరకు 86 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య తెలిపారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇంకా రైతుల వద్ద ధాన్యం నిల్వ ఉంటే ప్రతి గింజనూ కొనుగోలు చేస్తామని, ఈ మేరకు ప్రభుత్వం అనుమతులు ఇచ్చిందని చెప్పారు. గతంలో జిల్లాలో 4.50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వచ్చేదని, ఈఏడాది 5 లక్షల మెట్రిక్ టన్నుల వరకు దిగుబడి వచ్చిందని, అందులో 75 శాతం ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం లక్ష్యం పెట్టుకుందని వివరించారు. లక్ష్యాలకు అనుగుణంగా విడతల వారీగా ధా న్యం కొనుగోలు చేస్తున్నట్లు చెప్పారు. రైతులెవరూ అధైర్య పడాల్సిన పని లేదని, ఆలస్యం అయినా ప్రతి గింజనూ కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని అన్నారు. ఇది రైతు సంక్షేమ ప్రభుత్వమని రైతులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూసుకోవడమే బాధ్యతగా పని చేస్తున్నామని పేర్కొన్నారు.

చంద్రబాబువి హత్యారాజకీయాలు

ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి, ఆయన కుటుంబ సభ్యులపై టీడీపీ తప్పుడు కథనాలతో పుస్తకాలను విడుదల చేయడం తగదని ఎమ్మెల్యే అన్నారు. హత్యారాజకీయాలకు తెరలేపింది చంద్రబాబునాయుడేనని, ఆయన చేయించిన రాజకీయ నాయకుల హత్యలను వివరించారు. హత్యారాజకీయాలకు చంద్రబాబు మారుపేరని, ఆయన కుటిల రాజకీయాలను టీడీపీ వారు తెలుసుకోవాలని హితవు పలికారు. జరిగినవి జరగనట్లు, జరగనవి జరిగినట్లుగా ఎల్లో మీడియా తప్పుడు కథనాలు రాయడం, ప్రచారం చేయడం సరికాదని మండిపడ్డారు. నియోజకవర్గంలో 'గడప గడపకు మనప్రభుత్వం' కార్యక్రమాన్ని 75శాతం పూర్తి చేశామని, దానిని కూడా వక్రీకరించి కొన్ని పత్రికలు కథనాలు రాయడం సబబు కాదని, తనపై ఏమైనా రాసేటప్పుడు తన అభిప్రాయం తీసుకుంటే బాగుండేదని అన్నారు. తనపై తప్పుడు కథనాలు సృష్టించినంత మాత్రాన తనకేమీ కాదని, విలువను కోల్పోయేది రాసే పత్రికలేనని తెలుసుకోవాలని హెచ్చరించారు.

పారదర్శకంగా పథకాలు

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పార్టీలతో సంబంధం లేకుండా అర్హులందరికీ పథకాలు అందిస్తున్నామని చెప్పారు. మార్చి 18వ తేదీ నుంచి గృహసారథులు, సచివాలయ కన్వీనర్‌లు గడప గడపకూ వెళ్లి గత టీడీపీ ప్రభుత్వ పాలనకు, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పాలనకు మధ్య వ్యత్యాసాలను ప్రజలకు వివరించనున్నారని తెలిపారు. వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌ను గెలిపించాలని పట్టభద్రులను కోరారు. పార్టీ సీనియర్ నాయకుడు, పురిటిపెంట వైస్ సర్పంచ్ మండల సురేష్, కె.రామునాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకోవాలి



విద్యార్థులకు నగదు, ప్రశంసాపత్రం అందచేస్తున్న జేసీ మయూరి అశోక్

- జేసీ మయూరి అశోక్

దత్తిరాజేరు: ప్రతీ విద్యార్థి పాఠశాల స్థాయిలోనే ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని, వాటి సాధనకు నిరంతం కృషి చేయాలని జేసీ మయూరి అశోక్ సూచించారు. పోరలి ఉన్నత పాఠశాలలో గతేడాది పదోతరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు పోరలి గ్రామానికి చెందిన, ఆ పాఠశాల పూర్వ విద్యార్థి కర్ణాటకలోని ఉడిపి జిల్లా కలెక్టర్‌గా పని చేస్తున్న మిత్తిరెడ్డి కూర్మారావు ప్రకటించిన నగదు ప్రోత్సాహకాలను బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ రైతు కుటుంబంలో పుట్టి ఈ పాఠశాలలో చదువుకుని కలెక్టర్ అయిన కూర్మారావును విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని సూచించారు. పదోతరగతి ఫలితాల్లో పాఠశాల స్థాయిలో ప్రథమ స్థానం సాధించిన ఆర్.గాయత్రికి రూ.5 వేలు, ద్వితీయ స్థానం సాధించిన ఎం.మణికి రూ.4 వేలు, తృతీయ స్థానం సాధించిన పి.నరేంద్రకు రూ.3 వేలు, నాలుగు, అయిదో స్థానాల్లో నిలిచిన పి.వంశీ, ఏ.రామకృష్ణకు రూ.2 వేలు చొప్పున నగదు అందజేశారు. అంతకుముందు పాఠశాలలో తరగతి గదులను, కంప్యూటర్ ల్యాబ్‌ను జేసీ పరిశీలించారు. ఎంఈఓ వెంకటరావు, ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం, తహసీల్దార్ రమేష్, హెచ్‌ఎం రామునాయుడు పాల్గొన్నారు.

ఆడపిల్లల సంపూర్ణ ఆరోగ్యమే ధ్యేయం



బాలుర ఉన్నత పాఠశాలలో మాట్లాడుతున్న ఐసీడీఎస్ పీడీ శాంతకుమారి

చీపురుపల్లి: తొమ్మిది నుంచి 21 సంవత్సరాల వయస్సు గల ఆడపిల్లలను సంపూర్ణ ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దడమే సఖి గ్రూపుల ముఖ్య ఉద్దేశమని ఐసీడీఎస్ పీడీ బి.శాంతకుమారి చెప్పారు. స్థానిక జిల్లా పరిషత్ బాలుర, బాలికోన్నత పాఠశాల, శ్రీనివాసా జూనియర్ కళాశాలల్లో విద్యార్థినులకు సఖి గ్రూపులపై బుధవారం అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ కౌమారదశలో ఉన్న ఆడపిల్లలకు అన్ని విషయాల్లోనూ అవగాహన కల్పిస్తూ వారిలో చైతన్యం తీసుకొచ్చేందుకు, ఆరోగ్యంతో పాటు విద్య, నైతిక విలువలు పెంపొందించేందుకు సఖి గ్రూపులు ఎంతో దోహదపడతాయని తెలిపారు.సీడీపీఓ కె.వి.ఎస్.ఆర్.రాజేశ్వరి, ఎంపీడీఓ కె.రామకృష్ణరాజు, సూపర్‌వైజర్ కృష్ణవేణి, హెచ్‌ఎం శ్యామలసాయి, గౌరీదేవి తదితరులు పాల్గొన్నారు.

ఆధార్ అనుసంధానం వేగవంతం చేయండి



మాట్లాడుతున్న ఆర్డీఓ అప్పారావు

చీపురుపల్లి: ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఓటరు కార్డుతో ఆధార్ అనుసంధానం ప్రక్రియను శతశాతం పూర్తి చేయాలని ఆర్డీఓ ఎం.అప్పారావు బీఎల్‌ఓలను ఆదేశించారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో బీఎల్‌ఓలతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ కొన్ని పోలింగ్ బూత్‌ల పరిధిలో ఆధార్ అనుసంధానం తక్కువగా జరిగిందని, ఆయా బూత్‌ల పరిధి బీఎల్‌ఓలు ఆధార్ అనుసంధానం ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. తహసీల్దార్ ఎం.సురేష్ తదితరులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ నూతన కార్యవర్గం ఎన్నిక



ప్రమాణం చేస్తున్న నూతన కార్యవర్గం

చీపురుపల్లి: ఏపీ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్(యూటీఎఫ్) మండల శాఖ నూతన కార్యవర్గం ఎన్నిక ఏకగ్రీవమైంది. మంగళవారం రాత్రి స్థానిక ఆంజనేయపురం ప్రాథమిక పాఠశాలలో యూటీఎఫ్ మండల మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా మండల నూతన కార్యవర్గాన్ని సభ్యులు ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా నడిపేన బలరాం, ప్రధాన కార్యదర్శిగా దువ్వాడ కృష్ణమూర్తి, గౌరవ అధ్యక్షుడిగా మామిడి శ్రీను, గౌరవ సలహాదారుడిగా గిడిజాల లక్ష్మునాయుడు, సహాధ్యక్షులుగా మజ్జి భారతి, వై.వి.రమణ, కోశాధికారిగా ఎస్.సురేష్ కుమార్, ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా యు.వినోద్, సహకార్యదర్శులుగా బి.జయరాం, ఎ.ప్రియాంక, ఎం.సత్యనారాయణ ఎన్నికయ్యారు. అనంతరం ప్రమాణ స్వీకారం చేశారు.రాష్ట్ర కౌన్సిలర్ మీసాల అప్పలనాయుడు, జిల్లా గౌరవ అధ్యక్షుడు ఆలుమూరి సత్యశ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల సందర్శన

జామి: మండలంలోని కుమరాం ఉన్నత పాఠశాల, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ)ను రాష్ట్ర బృందం సభ్యులు ఎం.మాణిక్యాలరావు(డైట్ ప్రిన్సిపాల్), అనితా రాణి(డైట్ లెక్చరర్) బుధవారం సందర్శించారు. పాఠశాలల్లో ఎల్‌ఐపీ(లెర్నింగ్ అండ్ ఇంప్రూవ్‌మెంట్) ప్రోగ్రాం అమలు తీరును పరిశీలించారు. ఉపాధ్యాయుల బోధన తీరును పరిశీలించడంతో పాటు విద్యార్థుల విద్యాసామర్థ్యాన్ని పరీక్షించారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రస్తుతం విద్యారంగంలో ఎదురవుతున్న సవాళ్లను,సమస్యలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం అనేక నూతన విధానాలను ప్రవేశ పెట్టిందన్నారు. అందులో భాగంగానే ఈఏడాది ఎల్‌ఐపీ కార్యక్రమాన్ని ప్రవేశపెట్టిందని చెప్పారు. కార్యక్రమం అమలు తీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు.అనంతరం ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఎంఈఓ జె.జయశ్రీ, హెచ్‌ఎం సీహెచ్.పద్మావతి తదితరులు పాల్గొన్నారు.



కుమరాం పాఠశాలలో ఉపాధ్యాయులతో సమావేశమైన రాష్ట్ర బృందం సభ్యులు

వేపాడ: మండలంలోని సోంపురం ఉన్నత పాఠశాలను రాష్ట్ర బృందం సభ్యులు ఎం.మాణిక్యాలరావు(డైట్ ప్రిన్సిపాల్) తదితరులు బుధవారం సందర్శించారు. ఎల్‌ఐపీ(లెర్నింగ్ అండ్ ఇంప్రూవ్‌మెంట్) ప్రోగ్రాం అమలు తీరును పరిశీలించారు. 6,7,8 తరగతుల విద్యార్థుల విద్యాసామర్థ్యాన్ని పరీక్షించారు. ఎంఈఓ కూర్మారావు,హెచ్‌ఎం బాలభాస్కరరావు పాల్గొన్నారు.

వలంటీర్ పోస్టుల నోటిఫికేషన్ నిలిపివేత

లక్కవరపుకోట: మండలంలో ఖాళీగా ఉన్న వలంటీర్ పోస్టుల భర్తీకి తాజాగా విడుదల చేసిన నోటిఫికేషన్‌ను తాత్కాలికంగా నిలిపేస్తున్నట్లు ఎంపీడీఓ కె.రూపేష్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు వలంటీర్ పోస్టుల నోటిఫికేషన్‌ను నిలిపివేస్తున్నట్లు ప్రకటించారు. ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాత మళ్లీ నోటిఫికేషన్ ఇస్తామని, దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు గమనించాలని సూచించారు.

28లోగా లైఫ్ సర్టిఫికెట్లు సమర్పించాలి

చీపురుపల్లి: ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగులు అంతా ఈ నెల 28లోగా తమ జీవన ప్రమాణ పత్రాలను స్థానిక ఉపఖజానాశాఖ కార్యాలయానికి అందజేయాలని ఏపీ విశ్రాంత ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి అంపోలు సత్యనారాయణ బుధవారం ఓ ప్రకటనలో సూచించారు. విశ్రాంత ఉద్యోగులు అంతా తప్పని సరిగా ఈకేవైసీ చేయించుకోవాలని , సీఎఫ్‌ఎంఎస్ నంబర్‌తో ఆధార్, ఫోన్ నంబర్ లింక్ చేసుకోవాల్సి ఉందని పేర్కొన్నారు. ఇన్‌కమ్ ట్యాక్స్ రిటర్న్స్ సమర్పించే సమయంలో పాన్, ఆధార్ లింక్ తప్పనిసరి అని, అందుచేత పాన్, ఆధార్ లింక్ కూడా చేయించుకోవాల్సిన అవసరం ఉందని తెలిపారు. జీవన ప్రమాణ పత్రాలకు సంబంధించిన వివరాలు నమోదు సబ్ ట్రెజరీ కార్యాలయంతో పాటు విశ్రాంత ఉద్యోగుల సంఘ భవనంలో కూడా చేస్తున్నట్లు వివరించారు. ఎలాంటి సందేహాలు ఉన్నా నేరుగా విశ్రాంత ఉద్యోగుల సంఘ భవనాన్ని, లేదా 83740 51700 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

240 టన్నుల ధాన్యం కొనుగోలుకు అనుమతి

దత్తిరాజేరు: మండలంలో ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ఇంకా రైతుల వద్ద నిల్వ ఉన్న 240 టన్నుల ధాన్యం కొనుగోలుకు ప్రభుత్వం నుంచి అనుమతులు వచ్చాయని ఏఓ అనురాధ తెలిపారు. మండల కేంద్రంలో బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడుతుఊ ఇప్పటికే మండల రైతుల నుంచి 7,500 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని చెప్పారు. మరో 240 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని త్వరలో కొనుగోలు చేస్తామని, రైతులు ఆందోళన చెందవద్దని సూచించారు.

పాడిరైతులకు అవగాహన



పాడిరైతులకు పశుగ్రాసం కటింగ్ యంత్రంపై అవగాహన కల్పిస్తున్న పశువైద్యాధికారి

జామి: పాడిరైతులకు ప్రభుత్వం అందిస్తున్న పథకాలపై పశువిజ్ఞానబడి కార్యక్రమంలో భాగంగా మండలంలోని చింతాడ గ్రామంలో పశువైద్యాధికారి గీతారాణి బుధవారం అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆడ పెయ్యిల పథకం, టీఎంఆర్ దాణా, పశుగ్రాస విత్తనాలు,చూడి పశువుల పోషణ,పెయ్యిల మరణాలు తగ్గించడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలు తదితర అంశాలను పాడిరైతులకు వివరించారు. పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రీసర్వేతో భూసమస్యలకు పరిష్కారం

చీపురుపల్లిరూరల్: రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సమగ్ర భూరీసర్వేతో ఎన్నోఏళ్లుగా అపరిష్కృతంగా ఉన్న భూసమస్యల కు శాశ్వత పరిష్కారం లభిస్తుందని వైఎస్సార్‌సీపీ మండల నాయకులు ఇప్పిలి అనంతం,వలిరెడ్డి శ్రీనివాసులనాయుడు, ఏఎంసీ చైర్మన్ దన్నాన జనార్దన్ అన్నారు. పి.కె.పాలవలస పంచాయతీ బైరెడ్డిపేట, మెట్టబడి గ్రామాల్లో భూసర్వే నిర్వహించనున్న నేపథ్యంలో ఆయా గ్రామాల రైతులతో బుధవారం సమావేశాలు నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ సర్వే చేసే సమయాల్లో రైతులంతా పొలాల వద్ద ఉంటూ సర్వే సిబ్బందికి సహకరించాలని కోరారు. సర్వే పూర్తయిన తర్వాత శాశ్వత భూహక్కులతో పాసు పుస్తకాలను ప్రభుత్వం అందిస్తుందని చెప్పారు. ఆయా గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన



మాట్లాడుతున్న డీసీసీబీ బ్రాంచ్ మేనేజర్ ప్రీతిమానస

గుర్ల: సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని స్థానిక డీసీసీబీ బ్రాంచ్ మేనేజర్ ప్రీతి మానస సూ చించారు. స్థానిక డీసీసీబీ బ్రాంచ్‌లో ఖాతాదారులకు ఆర్థిక అక్షరాస్యత, డిజిటల్ లావాదేవీలు, సైబర్ నేరాలపై బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రోజురోజుకూ పెరుగుతున్న టెక్నాలజీ వల్ల ఆర్థిక మోసాలు అదేస్థాయిలో పెరిగిపోతున్నాయని అన్నారు. ఆన్‌లైన్ లావాదేవీల విషయంలో జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు. డీసీసీబీ బ్యాంకు కూడా రిజర్వ్ బ్యాంకు ఆఫ్ ఇండియా పరిధిలోకి చేరిందన్నారు. డిపాజిట్ దారులకు అధిక వడ్డీ చెల్లించడానికి డీసీసీబీ సిద్ధంగా ఉందన్నారు. డీసీసీబీ సిబ్బంది, గూడెం పీఏసీఎస్ సీఈఓ శీరస్వామి తదితరులు పాల్గొన్నారు.

పక్కాగా మెనూ అమలు



బొండపల్లి: గొట్లాంలో భోజనాలను పరిశీలిస్తున్న అధికారులు



దత్తిరాజేరు: విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్న ఎంఈఓ వెంకటరావు

బొండపల్లి: జగనన్న గోరుముద్ద పథకంలో భాగంగా ప్రభుత్వం నిర్దేశించిన మెనూను పథకం నిర్వాహకులు పక్కాగా అమలు చేయాలని మండల ప్రత్యేక అధికారి ఎస్.వి.కె.దుర్గాప్రసాద్ అన్నారు. గొట్లాం ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాలను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రోజూ మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించేలా పర్యవేక్షణ చేయాలని హెచ్‌ఎం శ్రీరామాచారికి సూచించారు. ఆయన వెంట ఎంపీడీఓ ఏ.వేదవతి ఉన్నారు.

దత్తిరాజేరులో..

దత్తిరాజేరు: స్థానిక ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాలను ఎంఈఓ వెంకటరావు బుధవారం పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి రోజూ మెనూ ప్రకారం భోజనాలు అందిస్తున్నారా లేదా అని అడిగి తెలుసుకున్నారు. పదోతరగతి పబ్లిక్ పరీక్షలు దగ్గర పడుతున్నందున ప్రత్యేక తరగతులు నిర్వహించాలని హెచ్‌ఎం రామునాయుడుకు ఎంఈఓ సూచించారు.

శతశాతం ఉత్తీర్ణతే లక్ష్యం

- పదోతరగతి విద్యార్థుల అవగాహన సదస్సులో డీడీ రత్నం



జామి: అలమండ పాఠశాలలో మాట్లాడుతున్న హెచ్‌ఎం సునీత



గజపతినగరం: పరీక్షలపై విద్యార్థినులకు సూచనలు ఇస్తున్న డీడీ రత్నం

గజపతినగరం: పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో విద్యార్థులు శతశాతం ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా షెడ్యూల్డ్ కులాలు, సంక్షేమ సాధికారత శాఖ అధికారి (డీడీ) పి.రత్నం సూచించారు. స్థానిక సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహంలో పదోతరగతి విద్యార్థినులకు పదోతరగతి పబ్లిక్ పరీక్షలపై గురువారం అవగాహన కల్పించా రు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థినులు కష్టపడి కాకుండా ఇష్టపడి చదువుకోవాలని అన్నారు. పరీక్షలకు సమయం దగ్గరపడుతున్నందున ఓ ప్రణాళిక ప్రకారం చదువుకోవాలని, పాఠ్యాంశాల్లో సందేహాలు ఉంటే ఉపాధ్యాయుల ను అడిగి నివృత్తి చేసుకోవాలని సూచించారు. విద్యార్థినుల చదువు, ఆరోగ్యంపై వసతి గృహ సంక్షేమ అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆదేశించారు. గజపతినగరం, బొండపల్లి, గంట్యాడ, నెల్లిమర్ల, గర్భాం వసతి గృహాల సంక్షేమ అధికారులు ఎం.గౌరి, కె.గౌరీలక్ష్మి, జి.గోవింద, సన్యాసిరావు, జి.సింహాచలం, ఎస్.వెంకటరావు, లోగిశ ఇంటిగ్రేటెడ్ వసతి గృహ సముదాయం సంక్షేమాధికారులు ఎస్.ఆర్.కె.నాయుడు, అప్పలనాయుడు పాల్గొన్నారు.



కొత్తవలస : విద్యార్థులు, తల్లిదండ్రుల సమావేశంలో సీఐ, తహసీల్దార్, ఎంపీడీఓ

పర్యవేక్షించండి..

కొత్తవలస: పదోతరగతి పబ్లిక్ పరీక్షలకు సమయం దగ్గరపడిందని, విద్యార్థులు ఇంటి వద్ద చదువుతున్నారా లేదా అని తల్లిదండ్రులు పర్యవేక్షిస్తుండాలని సీఐ ఎస్.బాలసూర్యారావు సూచించారు. స్థానిక ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థుల తల్లిదండ్రులతో హెచ్‌ఎం బండారు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో బుధవారం సమావేశం నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ పదోతరగతి విద్యార్థులకు ప్రస్తుత సమయం ఎంతో కీలకమైనదని, పిల్లలు టీవీ, మొబైల్స్‌తో కాలక్షేపం చేయకుండా వారిని దగ్గరుండి చదివించాలని చెప్పారు. తహసీల్దార్ డి.ప్రసాదరావు,ఎంపీడీఓ వై.పద్మజ మాట్లాడుతూ పిల్లలు చదువుకునే సమయంలో టీవీలు వేయవద్దని, పిల్లలకు పౌష్టికాహారం అందిస్తూ, చదువుకునేందుకు సరైన సదుపాయాలు కల్పించాలన్నారు. పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రత్యేక శ్రద్ధ అవసరం

జామి: విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేలా తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని అలమండ ఉన్నతపాఠశాల హెచ్‌ఎం సునీ త అన్నారు. పాఠశాలలో పదోతరగతి విద్యార్థులకు పబ్లిక్ పరీక్షలపై అవగాహనతో పాటు, తల్లిదండ్రుల సమావేశం బుధవారం నిర్వహించారు. విద్యార్థులను టీవీలు, సెల్‌ఫోన్లకు దూరంగా ఉంచాలని, వారికి పనులు చెప్పకుండా చదివించాలని తల్లిదండ్రులకు సూచించారు. ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి పనుల పరిశీలన



చీపురుపల్లిరూరల్: ఉపాధి వేతనదారులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ రామకృష్ణరాజు

వేపాడ: మండలంలోని సోంపురం గ్రామంలో చేపడుతున్న ఉపాధి పనులను ఎంపీడీఓ సాయికూర్మనాథ్ పట్నాయక్ బుధవారం పరిశీలించారు. నిబంధనల ప్రకారం పనులు చేయాలని వేతనదారులకు, పని ప్రదేశంలో తాగునీరు, నీడ సౌకర్యాలు కల్పించాలని ఫీల్డ్ అసిస్టెంట్‌కు సూచించారు.

నిమ్మలవలసలో..

చీపురుపల్లిరూరల్: మండలంలోని నిమ్మలవలస గ్రామంలో ఉపాధి హామీ పనులను ఎంపీడీఓ కె.రామకృష్ణరాజు బుధవారం పరిశీలించారు. ఉపాధి సిబ్బంది ఇచ్చిన కొలతల ప్రకారం పనులు చేస్తే ప్రభుత్వం నిర్దేశించిన గరిష్ఠ వేతనం అందుతుందని వేతనదారులకు సూచించారు. అంతకుముందు గ్రామంలోని సచివాలయాన్ని ఆయన సందర్శించారు. రికార్డులను పరిశీలించి సచివాలయ సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సర్వీస్ సేవలు, ఏడీజీ, పీఎంజేఏవై సర్వే,సఖి గ్రూపుల నిర్వహణ తదితర అంశాలపై ఆరా తీశారు.

నవధాన్యాల సాగుతో భూసారం



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, సబల ప్రతినిధులు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

లక్కవరపుకోట: నవధాన్యాల సాగుతో భూసారం పెరుగుతుందని సబల స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి ఈశ్వరరావు, ప్రకృతి వ్యవసాయం ఏపీఎం సూర్యనారాయణ అన్నారు. నవధాన్యాల సాగుతో కలిగే ప్రయోజనాలపై మండలంలోని చందులూరు గ్రామంలో ఉన్నత పాఠశాల విద్యార్థులతో కలిసి బుధవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఈశ్వరరావు, సూర్యనారాయణ మాట్లాడుతూ రైతులు ఒకే రకం పంట సాగు చేయకుండా పంట మార్పిడి చేసుకోవాలని సూచించారు. నవధాన్యాల సాగుతో భూమిలో సూక్ష్మపోషకాలు వృద్ధి చెందుతాయని, సేంద్రియ కర్బనం పెరుగుతుందని చెప్పారు. ప్రకృతి వ్యవసాయం ప్రతినిధులు కోటరావు, కనకమహాలక్ష్మి, గాయత్రి, రాధిక పాల్గొన్నారు.